ఇప్పగూడెం గ్రామస్తులతో మాట్లాడుతున్న వాజేడు ఎస్సై వెంకటేశ్వరరావు

ఇప్పగూడెం కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం

వాజేడు, జూన్ 9: మండలంలోని గుమ్మడిదొడ్డి గ్రామ పంచాయ తీలోని ఇప్పగూడెంలో ఆదివారం సీఆర్పీఎఫ్ పోలీసులతో కలిసి ఎస్సై చావళ్ల వెంకటేశ్వర రావు కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వ హించారు. మావోయిస్టులకు ఎవరూ సహకరించొద్దని, వారి సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలని సూచించారు. గుమ్మడిదొడ్డి గ్రామ శివారులోని ఇప్పగూడెం క్రాస్‌రోడ్డు 163 జాతీయ రహ దారిపై ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు.

ఇసుక రీచ్‌ను సొసైటీకే కేటాయించాలి

వెంకటాపురం(నూగూరు), జూన్ 9: మండలంలోని వీఆర్‌కే పురం ఇసుక రీచ్‌ను సమ్మక్క, సారక్క ఇసుక సొసైటీకే ఇసుక రీచ్‌ను కేటాయించాలని సొసైటీ సభ్యులు కోరారు. ఆదివారం వీఆర్‌కే పురంలో గ్రామస్తులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కొంతకాలంగా ఇసుక రీచ్ నిర్వహణ కోసం తాము కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నట్లు వాపోయారు. కొత్తగా ఏర్పడిన సొసైటీకే రీచ్‌ను ఇవ్వాలని కోరటం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. అధికారులు తిరిగి గ్రామసభ నిర్వహించాలని కోరారు. గ్రామస్తులు వెంకటేశ్వర్లు, సమ్మయ్య, భార్గవ్ ఉన్నారు.

సింగరేణి సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొత్త హరిబాబు

కొత్త హరిబాబు

భూపాలపల్లి రూరల్, జూన్ 9: భూపాలపల్లి ఏరియా ది సింగరేణి సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కాసింపల్లికి చెందిన కొత్త హరిబాబు మూడోసారి ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ భవనంలో ఎన్నికలు నిర్వ హించారు. అధ్యక్షుడిగా కొత్త హరిబాబు పోటీచేయగా భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి సివిల్ కాంట్రాక్టర్లు తమ ఓటు వేసి మూడోసారి గెలిపించారు. ఉపాధ్యక్షుడిగా బడితెల వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శిగా కెక్కర్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి గంట దేవేందర్ రెడ్డి, కోశాధికారి తిరుపతి, కార్యవర్గ సభ్యులుగా బట్టు శ్రీనివాస్, కోనేరు సాంబశివరావు, గోగుల శ్రీనివాస్‌రెడ్డి, నాగవెల్లి రాజలింగ మూర్తి, పెరుమాండ్ల చంద్రమౌళి, శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు.

ప్రశాంతంగా ప్రిలిమినరీ పరీక్ష

- జిల్లా వ్యాప్తంగా హాజరైన 3,331 మంది అభ్యర్థులు
- ఓఎంఆర్ షీట్లు, మెటీరియల్ స్ట్రాంగ్ రూమ్‌కు తరలింపు
- పరిశీలించిన కలెక్టర్ భవేశ్‌మిశ్రా

గణపురం: అభ్యర్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపుతున్న సిబ్బంది

భూపాలపల్లి రూరల్, జూన్ 9: జిల్లాలో ఆదివారం గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు కలెక్టర్ భవేశ్‌మిశ్రా తెలిపారు. గణపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని సందర్శించి, పరీక్ష నిర్వహణ తీరు, కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. అభ్యర్థులు, సిబ్బంది హాజరు గురించి ముఖ్య పర్యవేక్షకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పరీక్షను పకడ్బందీగా నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 17 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 4,473 మంది అభ్యర్థులకుగాను 3,331 మంది హాజరయ్యారని, 1,142 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. కట్టుదిట్టమైన పోలీస్ భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్ నుంచి ప్రశ్న పత్రాలు, సామగ్రిని పరీక్ష కేంద్రాలకు తరలించినట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు పరీక్ష ముగిసిన తర్వాత అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లు, ఇతర మెటీరియల్‌ను నిబంధనలకు అనుగుణంగా సీల్ వేసి పోలీస్ భద్రత, పటిష్ట ఎస్కార్ట్‌తో తిరిగి స్ట్రాంగ్ రూమ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. కాగా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్ష తీరు, పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు.

గణపురంలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

గణపురం: గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష మండలంలోని ఐదు కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్లో పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ భవిష్ మిశ్రా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలోని గదులను సందర్శించి అభ్యర్థులకు ఏర్పాటు చేసిన సదుపాయాలను గమనించారు. ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)లో 360 మంది అభ్యర్థులకు గాను 263 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 216 మంది కిగాను 164 మంది, గాంధీనగర్‌లోని సీఎస్ఐ పరీక్షా కేంద్రంలో 216 మందికి గాను 158 మంది, చెల్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 312 మందికిగాను 224 మంది, కేటీపీపీ డీఏవీ పాఠశాలలో 239 మందికి గాను 173 మంది హాజరయ్యారు. మొత్తం ఐదు పరీక్ష కేంద్రాల్లో 1,343 మందికిగాను 982 మంది హాజరై 73శాతంగా నమోదైంది. మండలకేంద్రంలోని గణపురం జడ్పీ పాఠశాలలో చివరి నిమిషంలో కొందరు అభ్యర్థులు పరుగులు తీశారు. అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు పరిశీలించగా, పరీక్ష పూర్తయ్యేవరకు స్థానిక ఎస్సై మచ్చ సాంబమూర్తి భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భూపాలపల్లి రూరల్: ఓఎంఆర్ షీట్లు, మెటీరియల్‌ను ఎస్కార్ట్‌తో స్ట్రాంగ్ రూమ్‌కు వాహనంలో తరలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

నీట్ పేపర్ లీకేజీపై విచారణ జరపాలి

కృష్ణకాలనీ, జూన్ 9 : నీట్ పరీక్ష ఫలితాలపై అనుమానాలు ఉన్నందున కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని ఏఐఎస్ఎఫ్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మే 5న నిర్వహించిన నీట్ పరీక్ష దేశ వ్యాప్తంగా సుమారుగా 34 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాయగా, ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థుల తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఒకే పరీక్షా కేంద్రంలో రాసిన ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులు రావడమే దీనికి కారణమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి దీనిపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేపట్టి ప్రతిభ గల విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మల్లూరులో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడి పూజలు

పూజలు చేస్తున్న లక్ష్మీనర్సింహారావు

మంగపేట, జూన్ 9: మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. వారి పేర అర్చనలు చేసిన తర్వాత పండితులు ఆశీర్వచనాలు ఇచ్చి, స్వామివారి శేషవస్త్రాలను అందజేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి ప్రదీప్‌రావు, దేవస్థాన మాజీ చైర్మన్ నూతిల కంటి ముకుందం, పార్టీ నాయకులు శ్రీనివాస్, రఘు, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి గుడివాడ శ్రీహరి పాల్గొన్నారు.

అభినందన పత్రాన్ని అందజేస్తున్న సదాశయ ఫౌండేషన్ సభ్యులు

నేత్రదానం చేసేందుకు ముందుకురావాలి

మల్హర్, జూన్ 9 : నేత్రదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సింగరేణి మణుగూరు ఎస్ఎంఎస్ ప్లాంట్ పీఓ నరసింహస్వామి అన్నారు. మండలంలోని వల్లెంకుంటకు చెందిన రైతు వేముల జగ్గారావు(82) ఇటీవల మరణించగా, కుటుంబ సభ్యుల అంగీకారంతో అతడి నేత్రాలను సేకరించారు. ఈమేరకు ఆదివారం గ్రామంలో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. అభినందన పత్రాన్ని అందజేశారు. నేత్ర, అవయవ, దేహదానంపై ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి సీహెచ్.లింగమూర్తి అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన నరసింహస్వామి మాట్లాడుతూ జగ్గారావు నేత్రాల దానంతో ఇద్దరి చూపు ప్రసాదించారని తెలిపారు. కొడుకు శ్రీనివాస్, కోడలు రాణి, కూతుళ్లు శ్రీలత, జయశ్రీ, హరిప్రియ, అల్లుళ్లు పి.శ్రీనివాస్, ప్రసాదరావు, మధుసూదన్‌రావును అభినందించారు.

అప్పులబాధతో ఒకరి ఆత్మహత్య

ప్రశాంత్(ఫైల్)

చిట్యాల(మొగుళ్లపల్లి), జూన్ 9 : అప్పు ల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మెట్టుపల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోటగిరి ప్రశాంత్ (29) అప్పులు చేసి భూపాలపల్లిలో మెడికల్ ల్యాబ్ పెట్టుకున్నాడు. అతడు కూతురు, భార్యతో కలిసి అమ్మానాన్నతో ఊరిలోనే జీవిస్తున్నాడు. చెల్లి పెళ్లి కోసం చేసిన అప్పు లు, ల్యాబ్ పెట్టేందుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక కొన్నాళ్లుగా మనస్తాపం చెందుతున్నాడు. శనివారం ఉదయం ప్రశాంత్ జమ్మికుంటకు పోతున్నట్లు చెప్పి వెళ్లి రాత్రి 11గంటలకు ఇంటికి వచ్చాడు. ఇంటి వెనుకకు వెళ్లి చాలా సమయం అవుతున్నా రాలేదు. తలుపు తీయకపోవడంతో భార్య తలుపు సందులో నుంచి చూడగా ఇంటివెనుక ఉన్న జామచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రమేశ్, జిల్లా కార్యదర్శి క్యాతరాజు సతీశ్‌కుమార్

ఏఐటీయూసీలో చేరికలు

కృష్ణకాలనీ, జూన్ 9 : మొగుళ్లపల్లి మండలం ఎల్లారెడ్డిపల్లికి చెందిన 21మంది సీఐటీయూ నాయకులు ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఐటీయూసీలో చేరారు. వారికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రమేశ్, జిల్లా కార్యదర్శి క్యాతరాజు సతీష్‌కుమార్ కండు వా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రమేశ్ మాట్లాడుతూ పని గంట ల విధానాన్ని తగ్గించి, కార్మికులపై వారి సమస్యలపై సంపూర్ణ అవగాహన కలిగి కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమిస్తున్నట్లు తెలిపారు. ఏఐటీయూసీ నాయకులు మొగుళ్లపల్లి మం డల కార్యదర్శి గులాం నబీ, నిమ్మల రాజయ్య, మొగిలి, చంద్రమౌళి, రాజయ్య, రవి, కొమురయ్య, రాములు, రవి, భిక్షపతి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

15క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

మహదేవపూర్, జూన్ 9 : మండలంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బొలెరో వాహనంలో అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నారనే సమాచారం మేరకు.. మండలకేంద్రంలో తనిఖీలు చేశారు. బొలెరోలో అక్రమంగా తరలిస్తున్న 15క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకొని, స్థానిక పోలిస్ స్టేషన్‌కు తరలించి కొర్లకుంటకు చెందిన నిందితుడు తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

జంపన్నవాగు వద్ద పెట్రోలింగ్ చేస్తున్న ఎస్సై, సిబ్బంది

పోలీసుల ముమ్మర తనిఖీలు

తాడ్వాయి, జూన్ 9: మండలంలో ఆదివారం ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యం లో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. గొల్ల పల్లిలో ప్రజల నుంచి వచ్చి న ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వాహనాల తనిఖీతోపాటు జంపన్నవాగు వద్ద పెట్రోలింగ్ నిర్వహించారు. నార్లాపూర్‌లో గుడుంబా తయారీ దారులకు హెచ్చరికలు జారీచేశారు. ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని సూచించారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు పూర్తి పత్రాలను కలిగి ఉండాలన్నారు.

ప్రతిభా పురస్కారానికి టెన్త్ విద్యార్థి

బిందుసాయిలత

ఏటూరునాగారం, జూన్ 9: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతర గతిలో 10 జీపీఏ సాధించిన శ్రీరాం బిందుసాయిలత వందేమాతరం ఫౌండేషన్ ద్వారా నిర్వహించే ప్రతి భాపురస్కారాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా పొందనున్నట్లు హెచ్ఎం సాంబ శివరావు తెలిపారు. ఈ ఏడాది జరిగిన పదోతరగతి పరీక్షల్లో రాష్ట్ర వ్యాప్తంగా 10 జీపీఏ సాధించిన వారిని వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సన్మానించనున్నట్లు తెలిపారు.

వెల్తుర్లపల్లి బొడ్రాయి వద్ద పూజలు

వెంకటాపూర్, జూన్ 9: మండలంలో ని వెల్తుర్లపల్లిలో ఆదివారం బొడ్రాయి, భూలక్ష్మి, పోచమ్మ. పోతరాజు ప్రతిష్ఠాపన ప్రథమ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితులు గోవర్ధన వెంకటాచార్యులు, యుగేందరాచార్యులు, సాయికుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులు పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు వాసుదేవారెడ్డి, దేవేందర్, మొగిలి, పరిపూర్ణచారి పూజలు నిర్వహించారు.

పూజలు చేస్తున్న గ్రామస్తులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

మహదేవపూర్: బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

కృష్ణకాలనీ/మహదేవపూర్, జూన్ 9: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని కొంపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.అమరేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం భూపాలపల్లి మండలం కొంపల్లి జెడ్పీ పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలను వివరిస్తూ విద్యార్థులను చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో వి ద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్నం రుచికరమైన భో జనం, ఉచిత విద్యతోపాటు రెండు జతల యూనిఫాం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు అనుభవం, అర్హత కలిగిన వారు ఉంటారని, ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య, క్రమ శిక్షణ అందుతుందన్నా రు. ఉ పాధ్యాయులు రమేశ్, రాజేంద్రాచారి, కార్తీక్, రామ్మోహన్ పాల్గొన్నా రు. కాగా, మహదేవపూర్ మండల కేంద్రంతోపాటు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఇంటింటికీ తిరుగుతూ ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల వివరాలను నమోదు చేసుకుంటున్నారు. హెచ్ఎం శంకరయ్య, ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఓవర్‌లోడుతో వెళ్తున్న లారీలు సీజ్

ములుగు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పోలీసుల తనిఖీలు

ములుగు రూరల్/ ఏటూరునాగారం/ వెంకటాపురం(నూగూరు)/ గోవిందరావుపేట/ వెంకటాపూర్/ వాజేడు, జూన్ 9: ములుగు జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఆదివారం విస్తృతంగా ఇసుక లారీల తనిఖీలు నిర్వహించారు. అధిక లోడ్‌తో వెళ్తున్న లారీలను పెద్ద సంఖ్యలో సీజ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఎస్సై వెంకటేశ్వర్ ఇసుక లారీలను తనిఖీ చేసి, అనుమతి పత్రాలను పరిశీలించారు. పరిమితికి మించి వేగంగా వెళ్లినా, అధిక లోడ్‌తో వెళ్లినా సీజ్ చేస్తామని హెచ్చరించారు. కన్నాయిగూడెం మండలం ఏటూరు ఇసుక క్వారీ నుంచి అధిక లోడుతో వెళ్తున్న ఐదు లారీలను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు స్థానిక సీఐ రాజు తెలిపారు. ఐదు లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వెంకటాపురం(నూగూరు) మండలం అలుబాకలో ముత్తారం ర్యాంపు నుంచి అధిక లోడ్‌తో ఇసుక తరలిస్తున్న ఎనిమిది లారీలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ బండారు కుమార్, ఎస్సై అశోక్ తెలిపారు. గోవిందరావుపేట, చల్వాయి గ్రామాల్లో అధిక లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీలను సీఐ శంకర్ తనిఖీ చేశారు. వే బిల్స్‌లో తేడా ఉన్న లారీలను సీజ్ చేశారు. వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్‌లోని టోల్‌ప్లాజా సమీపంలో ఎస్సై చల్ల రాజు ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఏటూరునాగారం వైపు నుంచి అధికలోడుతో వస్తున్న ఐదు ఇసుక లారీలను సీజ్ చేశారు. లారీడ్రైవర్ల శ్రవణ్, లక్ష్మణ్, సూర్య, రాంచరణ్, వెంకటయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వాజేడు మండలం జగన్నాథపురం వై జంక్షన్ వద్ద వాజేడు పోలీసులు, ధర్మవరం శివారులో పేరూరు ఎస్సైలు చావళ్ల వెంకటేశ్వరరావు, రమేశ్ ఆదివారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ధర్మవరం వైపు నుంచి వేగంగా వస్తున్న ఇసుక లారీలను పోలీసులు తనిఖీ చేశారు. అధిక లోడ్ ఉన్న పది లారీల ను సీజ్ చేసి ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించి, లారీడ్రైవర్లపై కేసు నమోదు చేశారు. ఆ యా లారీలు అయ్యవారిపేట, రాంపురం ఇసుక ర్యాంపుల నుంచి వస్తున్నట్లు పేర్కొన్నారు.

వెంకటాపురం(నూగూరు): లారీ డ్రైవర్ల వివరాలను అడిగితెలుసుకున్న సీఐ కుమార్, ఎస్సై అశోక్

ములుగు రూరల్: ఇసుక లారీ అనుమతులను పరిశీలిస్తున్న ఎస్సై

రామోజీరావుకు ఘనంగా నివాళి

వెంకటాపురం(నూగూరు), జూన్ 9 : ఈనాడు సంస్థ అధినేత రామోజీరావుకు మండల విలేకరులు ఆర్ఆండ్‌బి అతిథిగృహం ఆవరణలో ఆదివారం నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రవీణ్, సంతోష్, నర్సింహాచారి, రాంబాబు, రాజేంద్రప్రసాద్, జగన్మోహనరావు, అశోక్, వికాస్, అనిల్, సాంబ, శ్యామ్, గణేశ్, అభి ఉన్నారు.

బీర్సాముండాకు ఘన నివాళి..

వెంకటాపురం(నూగూరు), జూన్ 9: మండలంలో ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆర్ఆండ్‌బీ అతిథిగృహం ఆవరణ లో బీర్సా ముండా 124వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నాయకులు రామచందర్, పర్శిక సతీష్, మునేశ్వరావు, సోమరాజు ఉన్నారు.

నివాళులు అర్పిస్తున్న విలేకరులు

చిట్యాల : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



మల్హర్: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చిట్యాల/మల్హర్, మే 9: చిట్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2005 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాలలో జరిగింది. ఎక్కడెక్కడో స్థిరపడిన సుమారు 140 మంది 20 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఉపాధ్యాయులు వెంకటమల్లు, రమణ, మోహన్, భద్రయ్య, ప్రకాశ్, సుధాకర్, శ్రీదేవి, కల్యాణి, కుమారస్వామి, వెంకటేశ్వర్లును సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఆత్మీయవిందు ఆరగించారు. పూర్వ విద్యార్థులు బుర్ర వెంకటేశ్‌గౌడ్, రాజు, పింగిలి శ్రీకాంత్, చింతల రాజేందర్, మైదం మహేశ్, రాజేశ్, రామకృష్ణ, బొచ్చు రాజు, పంచిక మహేశ్ పాల్గొన్నారు.

తాడిచర్ల జడ్పీ స్కూల్‌లో..

మల్హర్ మండలం తాడిచర్ల జడ్పీ స్కూల్‌లో 2003-04 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 21 ఏళ్ల తర్వాత ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. వారి స్థితిగతులను చర్చించుకున్నారు. గురువులు కృష్ణమాచారి, సార్ల రాజయ్య, మల్క భాస్కర్‌రావు, మల్క మధుసూదన్‌రావు, ఏకాంబరం శాలువాలతో సన్మానించి మెమెంటోలు అందించారు. పూర్వవిద్యార్థులు ఆర్ని ఉదయ్‌కుమార్, రామిడి సతీష్, బూడిద సతీష్, బొంతల రమేశ్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ప్రగళ్లపల్లిలో ముత్యాలమ్మ పండుగ

వాజేడు, జూన్ 9: మండలంలోని ప్రగళ్లపల్లిలో గ్రామదేవత ముత్యాలమ్మ తల్లికి గిరిజన సంప్రదాయం ప్రకారం పూజలు (ఎల్లనంపుడు) చేశారు. తొలుత గ్రామస్తులు డప్పువాయిద్యాలతో శివార్లలో రోడ్డుకు ఇరువైపులా బూరిక చెట్లు నాటి తోరణాలు కట్టారు. చక్రాల బండి తయారు చేసి దానికి పూజలు చేసి ఊరుచివర్లో వేపాకులతో పందిరి వేసి ముత్యాలమ్మకు పూజలు చేసి బోనాలు సమర్పించారు. పప్పుబెల్లాలు పంచుకున్నారు. కోళ్లు, మేకలు బలిచ్చి మొక్కులు చెల్లించారు.

సందబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న భిక్షపతిగౌడ్

నిస్వార్థపరుడు సందబాబు

ములుగు రూరల్, జూన్ 9 : రచయిత, జర్నలిస్టు సంద బాబు నీతి, నిజాయతీ గల నిస్వార్థపరుడని ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతిగౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో బాబు యాది సభను నిర్వహించగా మహర్షి కళాశాల విద్యాసంస్థ అధినేత తుమ్మ పిచ్చిరెడ్డి హాజరై బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బాబు విగ్రహాన్ని జిల్లా కేంద్రంలో లేదా స్వగ్రామమైన వెంకటాపూర్ మండలం నారాయణపూర్‌లో ఏర్పాటు చేయాలన్నారు. బాబు తండ్రిని శాలువాతో సత్కరించారు. సామాజికవేత్త పింగిలి నాగరాజు, మొగుళ్ల భద్రయ్య, రవిగౌడ్, గుడిమీది వెంకటేశ్వర్లు, రేలా విజయ్, సూరయ్య, రవికుమార్, రమేశ్ పాల్గొన్నారు.

ఐఐటీ విద్యార్థినికి పోలీసుల ఆర్థికసాయం

విద్యార్థినికి ఆర్థికసాయం చేస్తున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, ఏఎస్సై నారాయణ

తాడ్వాయి, జూన్ 9 : నిరుపేద విద్యార్థినికి పోలీసులు ఆదివారం ఆర్థిసాయం అందించి అండగా నిలిచారు. మండలంలోని నార్లాపూర్‌కు చెందిన సంకె పల్లవి ముంబై ఐఐటీలో ప్రవేశం పొందింది. నిరుపేద కుటుంబంకావడంతో ఫీజు కట్టలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, ఏఎస్సై నారాయణ, సిబ్బంది కలిసి ఆదివారం విద్యార్థిని ఇంటికెళ్లి రూ. 15 వేలు అందించారు. ఎస్సై మాట్లాడుతూ పల్లవి ఒకటో తరగతి నుంచి బీటెక్ వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి బెంగళూరు కేంద్రీయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ ఇంజినీరింగ్ పూర్తి చేసి నాలుగు నెలల క్రితం గేట్ ప్రవేశ పరీక్ష రాయగా, జాతీయ స్థాయిలో 104వ ర్యాంకు సాధించిందని తెలిపారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో బాంబే ఐఐటీలో ప్రవేశం పొందగా ఫీజు రూ. 70వేలు చెల్లించాల్సి ఉండగా తమవంతుగా సాయం చేసినట్లు చెప్పారు. తండ్రి చనిపోగా, తల్లి అనారోగ్యంతో బాధపడుతోందని పేర్కొన్నారు. దాతలు ముందుకు వచ్చి విద్యార్థిని ఆదుకోవాలని ఎస్సై కోరారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

గణపురం, జూన్ 9: మండలంలోని గాంధీనగర్‌కు చెందిన పాత్రికేయుడు మరుపట్ల కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఆదివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్థానిక తాజా మాజీ సర్పంచ్ మాదం మమతా సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భువనసుందర్, సొసైటీ మాజీ చైర్మన్ కాల్వ రాంరెడ్డి, ఎంపీటీసీ సరస్వతీ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.